01ATP15F_01ATP15F.qxd 15-05-2026 PM 10:56 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 16 మే 2026 పేజీలు: 04

పుట్టపర్తిలో ఏఎంసీఏ డిఫెన్స్ ప్రాజెక్ట్ ఓ చరిత్రాత్మక ఘట్టం

- దేశంలో 25.3 శాతం పెట్టుబడులు ఏపీలోనే - భవిష్యత్తు టెక్నాలజీ డ్రోన్లదే - కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

పుట్టపర్తి, మే 15, ప్రభాతవార్త

పుట్టపర్తిలో ఏఎంసీఏ డిఫెన్స్ ప్రాజెక్ట్ ఓ చరిత్ర త్మక ఘట్టం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శ్రీసత్యసాయిజిల్లా పుట్టపర్తి పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్దనున్న సభావేదికలో గురువారం ప్రతిష్టాత్మక మైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాలకు ప్రాజెక్టులు తీసుకురావడం అంత సులభం కాదని, ముఖ్యంగా రక్షణ రంగానికి సంబంధించిన పెట్టుబడులు రావాలంటే ఆ ప్రాంతంపై పూర్తి నమ్మకం ఉండాలన్నారు. దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 25.3 శాతం మన ఆంధ్రప్రదేశ్‌కే రావడం గొప్ప విషయం అని, దీనికి కారణం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలిసి నడిపిస్తున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా కృషి వల్ల పుట్టపర్తి ప్రపంచానికి శాంతి కేంద్రంగా మారిందన్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక సహకారం అందించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు తెలుగు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భవిష్యత్తు టెక్నాలజీ డ్రోన్లదేనని భావించి విజయవాడలో డ్రోన్ సమ్మిట్ నిర్వహించామన్నారు. ఆ తర్వాత డ్రోన్ సిటీని దేశంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని చంద్రబాబు నాయుడు నిర్ణయించారని, అది కర్నూలు ఓర్వకల్లు ప్రాంతంలో ఏర్పాటు అవుతోందన్నారు. డ్రోన్ల తయారీ జరుగుతున్నా, పరీక్షించే సదుపాయాలు దేశంలో లేవని, అందుకే కర్నూలు ఎయిర్‌పోర్ట్‌ను డ్రోన్ టెస్టింగ్ సాండ్ బాక్స్ ఫెసిలిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, అంతర్జాతీయ కనెక్టివిటీ పెంపుపై దృష్టి పెట్టామని, విశాఖపట్నం నుంచి అబుదాబికి, విజయవాడ నుంచి సింగపూర్‌కు కూడా విమాన సర్వీసులు తీసుకువచ్చామన్నారు. త్వరలో తిరుపతి నుంచి కువైట్‌కు కూడా అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించబోతున్నామన్నారు. రాష్ట్రంలో విమాన ప్రయాణికుల సంఖ్య కూడా భారీగా పెరుగుతోందని, ఇది అభివృద్ధికి సంకేతం అని పేర్కొన్నారు. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు ఏ ప్రాంతాన్నీ వదలకుండా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని, వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 లక్ష్యాల సాధనకు మీ ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానన్నారు. రక్షణ రంగ అభివృద్ధి వల్ల సివిల్ ఏవియేషన్ రంగానికి కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుందని, అందుకే ఈ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ భవిష్యత్తులో మన రాష్ట్రానికి మరింత అభివృద్ధి తీసుకువస్తుందని విశ్వసిస్తున్నానన్నారు.

అత్యంత నాణ్యతా ప్రమాణాలతో లైనింగ్ పనులు పూర్తి చేయాలి

4లో....

ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు

సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్న ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు

పుట్టపర్తి రూరల్ మే 15 ప్రభాతవార్త:

సత్య సాయి బాబా మహాసమాధిని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర రక్షణ శాఖ మంత్రి మరియు విమానయాన శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దర్శించుకున్నారు. శుక్రవారం పుట్టపర్తిలో విమా నాల తయారీ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం పుట్టపర్తి ప్రశాంత నిలయానికి చేరుకున్నారు. వారికి ప్రశాంతి నిలయం ట్రస్ట్ సభ్యులు ఐ ఎస్ ఎన్ ప్రసాద్, మనోహర్ శెట్టి , వందిత శర్మ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి కేంద్ర మంత్రులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, గ్రామీణ సంక్షేమం, ఆధ్యాత్మిక రంగాలలో అందిస్తున్న సేవలను వివరించారు, అనంతరం ట్రస్ట్ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, బిజెపి జాతీయ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.

భక్తికే కాదు దేశ భద్రతకు కేంద్రంగా పుట్టపర్తి

- 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం - రాయలసీమను డ్రాట్ జోన్ నుండి గ్రోత్ జోన్ గా మారుస్తున్నాం
- బంగారు ఉత్పత్తి కేంద్రంగా ఆంధ్ర ప్రదేశ్ - ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

వర్చువల్ విధానం ద్వారా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తదితరులు



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

శ్రీ సత్యసాయి జిల్లా, మే 15, ప్రభాతవార్త ప్రతినిధి

ప్రపంచం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పుట్టపర్తిని కేవలం భక్తి కే కాదు దేశభద్రత కూడా కేంద్రంగా చూడబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలసి పుట్టపర్తి లోని బ్రాహ్మణపల్లి వద్ద ఏర్పాటుచేసిన సభా వేదికలో వర్చువల్ గా ప్రారంభించారు. అలాగే ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్న కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్ సీఎల్ ప్రాజెక్టులకు చెందిన శిలాఫలకాలను కూడా వర్చువల్ గా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలతో విశ్వశాంతికి బాటలు పడ్డాయన్నారు. ఇక్కడ అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకం అని, దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతుందన్నారు. ఏఎంసిఏ ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారనీ, ఆధునికతరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా ఈ ప్రాజెక్టు ఏర్పాటు అవుతోందన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందన్నారు. ఆపరేష్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, పరీక్షించారని, ఏ ఎం సి ఏ లాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు ధన్యవాదాలు తెలిపారు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించ బడనున్నాయన్నారు .ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుందన్నారు. రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామనీ, జెట్ స్పీడ్ తో అనుమతులిచ్చామన్నారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ప్రాజెక్టుతో మరికొన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు కూడా వస్తాయనీ, భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామన్నారు. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయనీ, వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిందన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్షశక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికే అండగా నిలుస్తుందన్నారు.కరవునీ మై న రాయలసీమను డ్రాట్ జోన్ నుండి గ్రోత్ జోన్ గా మారుస్తామన్నారు.లక్ష కోట్ల రూపాయలతో సీమను హార్టికల్చర్ హబ్ గా తయారు చేస్తున్నామన్నారు. కడప స్టీల్ ప్లాంటును జూన్ లో ప్రారంభించి 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుందనీ, కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్ గా మారుతుందన్నారు. తిరుపతిలో రాయల్ ఎన్ ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరికోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కియా పరిశ్రమ 18 లక్షల కార్లు తయారు చేస్తోందని. కరవు సీమలో తయారైన కార్లు 80 దేశాల్లో తిరుగుతున్నాయన్నారు. గతంలో గోల్డ్ అంటే కర్ణాటక లోని కే జి ఎఫ్ ఉండేదని, ఇప్పుడు గోల్డ్ అంటే బంగారు ఉత్పత్తి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందన్నారు. కర్నూలులోనీ జేజిఎఫ్ (జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్) ద్వారా ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుందనీ, రెండో ఏడాది 1500 కిలోల బంగారం తయారవుతుందన్నారు. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని, వీటివల్ల 24 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు ఎకనామిక్ రీజియన్లలో పెట్టుబడులు వస్తాయన్నారు. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఏపీలో మొలిక సదుపాయాలు కల్పిస్తాం, వేగంగా అనుమతులిస్తామన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మనపై కూడా పడిందనీ, ఇంధనం, బంగారం కొనుగోలుతో విదేశీ మారకనిల్వలు తరిగి పోతున్నాయన్నారు. ప్రధాని ప్రతిపాదించిన వర్క్ ఫ్రమ్ హోమ్ లాంటి 7 అంశాలను మనం కూడా ఆచరిద్దామన్నారు. ఇతర దేశాలు కూడా పొదుపు చర్యలు చేపట్టాయనీ, మనం కూడా బాధ్యతతో పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ సంఖ్యను తగ్గించా మన్నారు. ప్రతీ భారతీయుడు సవాళ్లను అధిగమించేలా చర్యలు తీసుకోవాలనీ, ప్రతీ సవాలును మనం ఓ అవకాశంగా మలచుకుందామన్నారు.

దేశ రక్షణ రంగానికి కేంద్రంగా బాబా జన్మభూమి

- కరువు నేలలో మొన్న కార్లు నేడు ఫైటర్ జెట్‌లు- ఏపీని ఇన్వెస్ట్మెంట్ డెస్టినీగా మార్చాం
- ఏఎంసీఏతో యువతకు ఉద్యోగ అవకాశాలు - రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్

పుట్టపర్తి, మే 15, ప్రభాతవార్త

దేశ రక్షణ రంగానికి నయా కేంద్రంగా శ్రీ సత్య సాయి జిల్లా మారబోతుందని రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారాలోకేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఏడీఏ ఆధ్వర్యంలో ఏఎంసీఏ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రినారాలోకేష్ మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్ కు ఏడాది పూర్తి అయ్యిందనీ , శత్రువుకు భారత రక్షణ దళాల శక్తి ఏమిటో ప్రధాని చూపించారన్నారు. దేశానికి గర్వపడే ప్రధాని మోడీ, ఐరన్ మ్యాన్ గా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఉన్నారనీకొనియాడారు. కూటమికి మద్దతు ఇచ్చిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు రిటర్న్‌గిఫ్ట్ ఇవ్వడానికే ఈప్రాజెక్టు తీసుకువచ్చామన్నారు. కరవు నేలపై మొన్నటివరకు కియా కార్లు రాగా, నేడు ఫైటర్ జెట్ రక్షణ ప్రాజెక్టులు వచ్చాయన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్ట్‌తో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు వస్తున్నా యనీ, బాబాస్ఫూర్తితో పుట్టపర్తికి కూటమి ప్రభు త్వం డిఫెన్సు ప్రాజెక్టు తెచ్చిందన్నారు. ఏపీని ఇన్వెస్ట్మెంట్ డెస్టినీగా మార్చామని, డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్ ఏపీలో ఉందనీ, నమో అంటే నాయుడు జీ, మోడీజీ జోడీ అన్నారు. మోడీజీ, చంద్రబాబుజి, రాజ్‌నాథ్‌సింగ్‌జీ 75ఏళ్ల కుర్రవాళ్లు అని, వారి స్పీడ్ ఇప్పటికీ ఎవరూ అందుకోలేరనీ వ్యాఖ్యానించారు.గూగుల్,ఆర్సెలార్‌మిట్టల్ లాంటి లక్షలకోట్ల ప్రాజెక్టులు ఏపీకివచ్చాయనీ, జువ్వల దిన్నెలో సాగర్ డిఫెన్సు వచ్చిందనీ, త్వరలో కర్నూలులోనూ హైకోర్టు బెంచ్ ఏర్పాటు కాబోతోందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో అతి తక్కువ సమయంలో ఈ ప్రాజెక్టును సాకారం చేసామన్నారు. ఏ ఎం సి ఏ కథ 2025 డిసెంబరులో ఢిల్లీలో మొదలైందనీ, రక్షణ మంత్రి రాజ్ నాథ్ ను కలిసి ఈ ప్రాజెక్టు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం వేగంగా ఈ ప్రాజెక్టు కోసం పనిచేసిందనీ, ఇది కేవలం డిఫెన్సు ప్రాజెక్టు మాత్రమే కాదు రాయలసీమకు కొత్త దిశను కల్పించే అత్యుత్తమ ప్రాజెక్టు గా పేర్కొన్నారు. ఇంత మంచి పెద్ద ప్రాజెక్టును ఏపీకి ఇచ్చినందుకు ప్రధాని మోదీకి, రక్షణ మంత్రికి రాజ్ నాథ్ సింగ్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

భూగర్భంలో మృత్యు ఘంటికలు

- అధికారుల ఉదాసీనతతో అడుగడుగునా అక్రమాలు - ప్రమాదాల ముప్పు..కనిపించని కనువిప్పు - ఉల్లం'ఘనుల'పై ఉదాసీనత..కరవైన కార్మికుల భద్రత

కప్టాల మధ్యన ఖనిజాన్ని వెలికితీస్తున్న కార్మికులు

భూగర్భం నుంచి వెలుపలికి తె(వ)స్తున్న స్టీటైట్ ఖనిజం

భూగర్భగని సారంగాలను పరిశీలిస్తున్న పోలీసులు

తాడిపత్రి, మే 15, ప్రభాతవార్త :

తాడిపత్రి ప్రాంతంలోని యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో గనుల మాఫియా బరితెగిస్తోంది. కొన్ని చోట్ల లీజుల మాటున ఆక్రమిత స్థలాల్లోనూ తవ్వకాలు సాగిస్తున్నారు. ఖనిజాలతో సహవాసం చేసే కార్మికులకు కనీస రక్షణ కరవైంది. బతుకుదెరువు కోసం చిన్న చిన్న సొరంగాల గుండా భూగర్భంలోకి వెళ్లి కొన్ని సార్లు లోపలే సమిధలైపోతున్నారు. ఆ ఖనిజాలతో వ్యాపారాలు చేసేవారు మాత్రం రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. అదే క్రమంలో రెవెన్యూ, భూగర్భ శాఖల సమన్వయ లోపం వీరికి కలిసొచ్చే అంశంగా మారింది. అనధికార పేలుళ్లతో, యంత్రాల సాయంతో ఇష్టానుసారంగా పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వేస్తున్నారు. నాణ్యమైన స్టీటైట్, డోలమైట్‌లను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పెద్దవడుగూరు మండలం కొండుపల్లి, క్రిష్టిపాడు, యాడికి మండలం చందన, వెంగన్నపల్లి, నగరూరు, గుడిపాడు, కుందనకోట, పెద్ద పప్పూరు మండలం ముచ్చుకోట, పెద్దయక్కలూరు, రావులుడికి తదితర ప్రాంతాల్లో డోలమైట్, స్టీటైట్, లైమ్‌స్టోన్ వంటి ఖనిజ నిక్షేపాలు సహజ సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ పనిచేసే కార్మికుల భద్రత గాలిలో దీపంగా మారింది. గనుల నిర్వహకులు లాభాలు వెనకేసుకోవడం తప్ప అందులో పనిచేసే కార్మికుల భద్రతను ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు, కార్మికుల ప్రాణాలు పోయినప్పుడు అధికారులు హడావుడి చేయడం, నిర్వహకులు కొద్ది రోజులు గనులు మూసివేయడం పరిపాటిగా మారింది. ఉల్లంఘనులపై ఉన్నత అధికారులు కూడా ఉదాసీనత ప్రదర్శిస్తుండటంతో కార్మికులు సర్వం కోల్పోతున్నారు. కొండుపల్లి లోని 42 స్టీటైట్ గనుల్లో కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సొరంగం లాంటి మార్గంలో వెళ్లి పేలుళ్లు జరిపి భూగర్భంలోని ఖనిజాన్ని వెలికితీయాల్సి వస్తోంది. ఈ సందర్భంలో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారో మిగతా 4 లో...

పేలుడు పదార్థాల పరిశీలనపై ఆదేశాలుంటేనే అధికారుల 'ఆ'గమనం

ఉకరవైన కార్మికుల భద్రతకు ఖ'నిజమే' సాక్ష్యం..!

పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన భూగర్భ గనులను కొందరు లక్ష్యంగా చేసుకొని ఖనిజ తవ్వకాలను సాగిస్తున్నారు. అనుమతులు కొంత.. ఆక్రమణలు, అక్రమాలు మరికొంత అన్న చందంగా పరిస్థితి తయారైంది. తవ్వకాలు చేస్తున్న చోట ప్రమాదం జరిగి కార్మికులు గాయాల పాలైతే..అక్రమ తవ్వకాలపైన తూతూ మంత్రపు జరిమానా లతో సరిపెట్టేలా గనులు, రెవెన్యూ శాఖలు పావులు కదపడం, పోలీసులు కేసే నమోదు చేయకపోవడం, మరో చోట అక్రమ తవ్వకాలు అడ్డుకునేందుకు వెళ్లిన అధికారిపై పోలీసుల ఎదుటే దూషణలకు దిగడం,తనిఖీలకు వెళ్లిన అధికారుల ఎదుటే అక్రమ తవ్వకాలు యథేశ్ఛగా సాగించడం వంటి ఘటనలు ఇక్కడి మైనింగ్ మాఫియా తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ తంతు వెనక రాజకీయ దన్ను ఉండటంతో అక్రమాలకు అడ్డూఆపూ లేకుండా పోతోంది. గనుల ఖిల్లాగా పేరొందిన కొండపల్లిలో ఈ దందా మరింత శృతి మించుతోంది. రెవెన్యూ, భూగర్భ శాఖల సమన్వయ లోపం వీరికి కలిసొచ్చే అంశంగా మారింది.

అత్యాధునిక క్యాన్సర్ కేర్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి సత్య కుమార్

పుట్టపర్తి రూరల్ మే 15 ప్రభాతవార్త:

దయాలసిస్ సేవలు గ్రామీణ పేదలకు ఉచితంగా అందించడం ఆదర్శమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తి లోని శ్రీ సత్య సాయి ప్యాలీయేటివ్ కేర్ అండ్ క్యాన్సర్ సెంటర్లో సుమారు 7.4 కోట్లతో బెంగళూరు కిడ్నీ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆధునిక డయాలసిస్ సెంటర్ ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఖరీదైన వైద్యం వారం కాకుండా సేవా భావంతో ఉచితంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్య సేవలో అందరికీ చేరేలా ప్రభుత్వం మరియు సేవా సంస్థలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, హాస్పటల్ సిబ్బంది,ప్రజా ప్రతినిధులు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్ కేర్ సెంటర్ ను ప్రారంభిస్తున్న మంత్రి సత్య కుమార్

కేంద్ర రక్షణ మంత్రికి సుస్వాగతం పలికిన బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి

పుట్టపర్తి రూరల్ మే 15 ప్రభాతవార్త:

రాయలసీమలో ఏ ఎం సి ఏ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. భారత్ రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించే ప్రయాణంలో ఒక మైలురాయిగా ఈ కార్యక్రమం నిలుస్తుందని భవిష్యత్తు వైమానిక ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ఉండటం గర్వకారణం అని ఆయన మంత్రతో పేర్కొన్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకోవడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి మోడీ గారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రమంత్రి స్వాగతం పలుకుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

విజ్ఞాన వికాసమే చిన్నారుల సృజనాత్మకతకు పునాది

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

కళ్యాణదుర్గం, మే 15 ప్రభాతవార్త

విజ్ఞాన వికాస శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

బాల్యం నుంచే విజ్ఞాన వికాసం ద్వారా చిన్నారుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోద విజ్ఞాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జీవివి జిల్లా అధ్యక్షులు చిత్తప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నార్త్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వేసవి శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చిత్తప్ప మాట్లాడుతూ, చిన్నారుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వివిధ అంశాలలో శిక్షణ అందించామని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర జన విజ్ఞాన వేదిక గౌరవ సలహాదారు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ, జన విజ్ఞాన వేదిక ప్రధానంగా సైన్స్ అంశంతో పనిచేస్తోందన్నారు. "సైన్స్ అంటే ఒక ఆలోచన, ఒక పరిశోధన" అని పేర్కొన్నారు. వేసవి శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, సంగీతం, పేపర్‌కటింగ్ వంటి అంశాలలో 15 రోజుల పాటు శిక్షణఇచ్చి చిన్నారుల్లో దాగి సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా కృషిచేసినట్లుతెలిపారు. సమాజంలోమూఢనమ్మకాల నిర్మూలనకు జనవిజ్ఞానవేదిక విశేషకృషిచేస్తోందన్నారు. గ్రామీణప్రాంతాల్లో శాస్త్రీయతను విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణా శిబిరంలో సేవలందించిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘం అధ్యక్షులు కిషోర్ కుమార్, వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగ ప్రసాద్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ ఆనంద్ రెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు రాజన్న, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు కనమ్ రామాంజనేయులు, యుటిఎఫ్ మండల మాజీ అధ్యక్షులు తిప్పేస్వామి, మంజునాథ, విశ్రాంత ప్రధానోపా ధ్యాయులు భగవాన్ దాస్, జిల్లా పీడీ అసోసియేషన్ సభ్యులు శివయ్య, సింగర్ లక్ష్మీదేవి, ఎన్జీవో నాయకులు సోమశేఖర్, ఆంగ్ల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, జేవీవీ జోనల్ అధ్యక్షులు కంబాల తిమ్మారెడ్డి, రీసోర్స్ పర్సన్స్ ప్రశాంత్, మెజీషియన్ టీచర్ ప్రశాంత్, గోవిందప్ప, మాంతేష్, అన్నపూర్ణ, కొల్లప్ప, అనిల్, రాముడు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరంలో సేవలు అందించిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

కిషోర్ బాల బాలికల సాధికారత మన అందరి బాధ్యత

ఆర్డిటి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

శెట్టూరు, మే 15 ప్రభాతవార్త

కార్యక్రమంలో మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు

కిషోర్ బాల బాలికల సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డిటి రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు పేర్కొన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, విద్య, ఆరోగ్యం, సమాన హక్కులపై అవగాహన పెంపొందించేందుకు ఆర్డిటి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ.. బాల బాలికలు విద్యతో పాటు సామాజిక బాధ్యతలను కూడా తెలుసుకొని ముందుకు సాగాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న బాల బాలికలు పలు అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బాల్య వివాహాలు, విద్య ప్రాముఖ్యత, ఆరోగ్య పరిరక్షణ, స్వీయ రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి సీఓ లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి

కళ్యాణదుర్గంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

కళ్యాణదుర్గం టౌన్, మే 15, ప్రభాతవార్త



అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

కళ్యాణదుర్గం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఎం ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పటికే దేశంలో అధిక ధరల భారంతో ప్రజలు తీవ్రఇబ్బందులుఎదుర్కొంటున్నారని, అలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచడం ప్రజలపై మరింత భారం మోపినట్లేనని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా అమాంతం పెరిగి సామాన్యులు జీవనం సాగించడం కష్టంగా మారిందన్నారు. ప్రజలు అప్పులఊబిలో కూరుకుపోతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం బాధాకరమని అన్నారు. పెంచిన ధరలను తగ్గించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలను అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా జిల్లాలో వందలాది గ్రామాలకు త్రాగునీరు అందిస్తున్న సత్యసాయి త్రాగునీటి పథకం కార్మికులు 11 రోజులుగా సమ్మె చేస్తున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని పెండింగ్ జీతాలను చెల్లించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, బడ్జెట్‌లో సత్యసాయి త్రాగునీటి పథకానికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిప్పానాయక్, ఎస్సీ ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు చెలిమప్ప, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ప్రకాష్, సిఐటియూ కార్యదర్శి రంగనాథ్, సత్యసాయి త్రాగునీటి యూనియన్ నాయకులు వన్నూరప్ప, తిప్పేస్వామి, రాధాకృష్ణ, భవిత్, హనుమంతరాయుడు, నగేష్, వెంటేశులు, గంగన్న, పరంధామ, ఎర్రస్వామి, శివన్న తదితర కార్మికులు పాల్గొన్నారు.

బాలయ్య చొరవతో 2 ఈ ఆటోలు

హిందూపురం మే 15 ప్రభాతవార్త

కమిషనర్ డాక్యుమెంట్ అందిస్తున్న దృశ్యం

హిందూపురం మున్సిపాలిటీ లో చెత్త సేకరణ కోసం బి.ఎస్.ఆర్ ట్రస్ట్ రెండు ఈ ఆటోలను విరాళంగా అందజేసింది. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో శుక్రవారం ఆ సంస్థ ప్రతినిధి ఆ వాహనాలను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జు న అందజేశారు. సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా దాతలు మున్సిపాలిటీకి సహకరించడం హర్షనీయమని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలు కూడా పట్టణం పరిశుభ్రంగా ఉండేల తమ వంతు బాధ్యతలను నిర్వర్తించాలని కమిషనర్ కోరారు.

ఈనెల 18 నుంచి రోడ్డు ఆక్రమణల తొలగింపు

హిందూపురం మే 15 ప్రభాతవార్త

ఈనెల 18 నుంచి రోడ్ల ఆక్రమణలు తొలగింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శుక్రవారం వెల్లడించారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో ఆటోల ద్వారా అనౌన్స్మెంట్ చేయించి వారం రోజులు ప్రజలే స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగింపు చేసుకోవడానికి గడువు ఇస్తామన్నారు. అయినా స్పందించకపోతే ప్రజల సౌకర్యం కోసం నిబంధనలు ప్రకారం తామే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈనెల 18న మేళాపురం తెలుగు తల్లి సర్కిల్ నుంచి ప్రారంభించి ముద్దిరెడ్డిపల్లి నంది సర్కిల్ వరకు తొలగింపు ప్రక్రియ ఉంటుందని చెప్పారు. అదేవిధంగా ఈనెల 25వ తేదీ నుంచి రాజీవ్ గాంధీ సర్కిల్ (రహమత్పురం సర్కిల్) నుంచి 2 టౌన్ పోలీస్ స్టేషన్ వరకు పనులు చేపట్టనున్నామని అన్నారు. జూన్ 1 నుండి బండి మోట్ సర్కిల్ పరిగి రోడ్డు మోత్కుపల్లి వరకు జరుగుతాయని చెప్పారు. ఈ క్రమంలో జూన్ 8 నుండి ఆర్ పి జి టి రోడ్డులో కట్ట కాలవ నుంచి దండు రోడ్డు జడ్పీ హైస్కూల్ వరకు అక్రమ కట్టడాలు తొలగించడం జరుగుతుందని వివరించారు.

స్వచ్ఛ రథం సేవలు వినియోగించు కోండి -ఎంపీడీఓ

బ్రాహ్మసముద్రం మే 15 ప్రభాతవార్త

ఎంపీడీవో ఏకాంబరేశ్వరయ్య

మండల పరిధిలోని పడమటి కోడిపల్లి గ్రామము నందు శనివారం స్వచ్ఛ రథం రావ్వడ జరుగుతుందని గ్రామమునందు ప్రజలు మీ ఇంటియందు గల ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు ఇచ్చినచో నిత్యావర సరుకుల ను స్వచ్ఛరతంలో అందచేస్తారని కావున ప్రజలు ఈ యొక్కసదావకాశన్ని సద్వినియోగ్నా చేసుకోవాలని బ్రహ్మ సముద్రం యంపిడిఓ ఎకాంబరేశ్వ రయ్య పత్రిక ముకంగా తెలియ చేయడం జరిగింది.

కాలువలో పడి బీటెక్ విద్యార్థి మృతి

హిందూపురం టౌన్ మే 15 ప్రభాతవార్త

చేతన్ రెడ్డి ఫైల్ ఫోటో

హిందూపురం మండలం రాచపల్లి గ్రామ శివారులోని అందరినీవా కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి బీటెక్ విద్యార్థి చేతన్ రెడ్డి 19 మృతి చెందాడు. శుక్రవారం చేతన్ రెడ్డి పశువులకు మీరు తాపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలోపడ్డాడు స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా ఫలితం లేకపోవడంతో వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు దీంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కాలువలో గాలింపు చర్యలు చేపట్టి చేతన్ రెడ్డి మృతదేహాన్ని వెలికి తీశారు. యువకుడి అకాల మరణంతో రాచపల్లి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి కుటుంబ సభ్యుల రోజులలో అక్కడున్న వారిని కలచివేశారు.

మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు...!

మంత్రి లోకేష్ పర్యటన సందర్భంగా పరిటాల శ్రీరామ్ ప్రకటన...!

ధర్మవరం,మే 15,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, విద్యాశాఖల మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యటనను విజయ వంతం చేసిన కార్యకర్తలకు, మహిళలకు, యువతకు, నాయకులకు ధర్మవరం నియోజ కవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం జరిగిన నారా లోకేష్ పర్యటనకు కార్యకర్తల నుంచి అనూహ్య స్పందన కనిపించిందన్నా రు. ధర్మవరం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు నాయకులు తరలివచ్చి మంత్రి నారా లోకేష్‌కు ఘనస్వాగతం పలికారన్నారు. పట్టణంలో ఆయనకు పూలవర్షం కురిపించి అభిమానం చాటుకున్నారన్నారు. బత్తలపల్లి మండల కేంద్రంలో ఒక జనసంద్రం కనిపించిందని, కార్యకర్తలు భారీగా తరలి రావడంతో నాలుగు మార్గాల్లో పసుపు జెండాలు కనిపించాయన్నారు. ఈ పర్యటనను ఇంత విజయవంతం చేసిన కార్యకర్తలకు పరిటాల శ్రీరామ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో తొలిసారి నియోజకవర్గానికి రావడమే కాకుండా ఆర్డిటికీ ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్ చేయించినందున మంత్రి లోకేష్ కు ఈ స్థాయిలో స్వాగతం లభించిందని అన్నారు. ఆర్డిటికీ ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్ కాక ఇబ్బందికర పరిస్థితులు ఉన్న సమయంలో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రధానమంత్రి మోడీ, హోం మంత్రి అమిత్ షా తో ఇక్కడ పరిస్థితి అంతా వివరించారన్నారు. ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్ కావడంలో నారా లోకేష్ ది చాలా కీలకమైన పాత్ర ఉందన్నారు. ఇందుకు జిల్లా ప్రజలు ఎప్పటికీ ఆయనకి రుణపడి ఉంటారన్నారు. భవిష్యత్తులో కూడా ఆర్డిటికీ ప్రభుత్వ సహకారం ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణ నైతిక బాధ్యత

గుత్తి, మే 15 ప్రభాతవార్త



రైల్వే అధికారులు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

గ్లోబల్ వార్మింగ్ కారణంగా పర్యావరణం అసమతుల్యమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడం తమ నైతిక కర్తవ్యంగా సామాజిక బాధ్యతగా భావించాలని గుత్తి రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డిఎంఇ రమేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం డీజిల్ షెడ్‌లో టీ విరామ సమయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణం దెబ్బతింటే మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఎంఈ జాన్ సాహెబ్, ఎస్ఎంఎం రంగనాథ్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాసులు, నరసింహ, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

బడి పిలుస్తుందిలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆనంద్

కనేకల్లు మే 15 ప్రభాతవార్త

విద్యార్థులతో మమేకమైన కలెక్టర్ ఆనంద్

ప్రభుత్వము ప్రజలకు పాఠశాలల్లో అందిస్తున్న విద్యను అధికారులు నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా చూడాలని ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆనందు సూచించారు. మండల కేంద్రంలోని నేసేపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా "బడి పిలుస్తోంది" కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా సేవలు, సౌకర్యాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యా సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా ఉన్నత ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అదనంగా 25 శాతం మేర విద్యార్థుల చేరిక పెరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఇందుకోసం ప్రతి గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, డీఆర్‌డీఏ వెలుగు సంఘ సభ్యులు, మ్యాప్ సిబ్బంది, మండల ఎంపీడీఓలు గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోను !

ప్రజా సమస్యలు పరిష్కారం కోసం జనతా వారధి

మా పోరాటం కూటమి పై కాదు ఆరాచకాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట మే 15 ప్రభాత వార్త

అన్నదాతలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరకోమని మాజీ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు శుక్రవారం తననివాసంలో ఏర్పాటుచేసిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాపోరాటం ప్రభుత్వానికి వ్యతిరేకకాదు లేకపోతే ఇక్కడ ఉన్నటువంటి రాజకీయ నాయకులకుకూడా నేను ఏమాత్రంవ్యతిరేకంకాదు ఎవరినైనా ఉద్దేశించి ఎవరికైనా వ్యతిరేకంచేయాలని ఉద్దేశంనాలో అంతకన్నా లేక ఇక్కడ జరుగుతున్నటువంటి ఒక ముఖ్యమైనటువంటి విషయం మా దృష్టికి రావడంతో స్పందించవలసిన అవసరం ఏర్పడిందని అది కూడా మనకు అన్నం పెట్టేటువంటి అన్నదాతలకు సంబంధించినటువంటి విషయం కాబట్టి నేను చెప్పే విషయం అబద్ధమని తెలిస్తే దేనికైనా సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. నేనుచెప్పే ప్రతి మాట వాస్తవం యదార్థమైనది, రైతులు గురించి నా దృష్టికి తీసుకువస్తే శాంతి నగర్లోని ఆ కూరగాయల మార్కెట్ దగ్గరికి వెళ్లడం జరిగింది మార్కెట్ లో సంచికి ఐదు రూపాయలు వసూలు చేయాలి కానీ వాళ్ళు 30రూపాయలు వసూలు చేస్తున్నారు. మనకు అన్నం పెట్టే రైతులు కడుపు కొట్టేది మూడు రూపాయలు కలెక్ట్ చేయాలి కానీ సంచికి 30 రూపాయలు బాక్స్ కి ..10 ఇంత ఘోరంగా రైతుల కడుపు కొట్టవచ్చునా కడుపుకి అన్నం తినేవాడు రైతు కడుపు కొడతాడా దీనికి ఎవరెవరు సహకరిస్తున్నారు వాళ్లందరూ స్పందించండని మండిపడ్డారు. అందరికీ అందుబాటులో ధరలు బోర్డు ఏర్పాటు చేయడం లేదు అదేవిధంగా సంత మార్కెట్లో దేనికి ఎంత రేటు పెట్టాలి ఎక్కడైనా బోర్డులు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు రాయదుర్గంలో జరుగుతున్న దానిపైన చర్యలు తీసుకోమని కమిషనర్ ను కోరగా కమిషనర్ నోటీసులు ఇస్తాను చర్యలు తీసుకుంటారని మాట ఇచ్చాడు మహిళా రైతులని కూడా సాయంకాలం నుంచి రాత్రంతా రోడ్ లో పెట్టుకుంటే హింస కాదా అని మాట్లాడితే నాపై దౌర్జన్యానికి వస్తే పోలీసులకు ఫోన్ చేస్తే స్పందించలేదు ఆయన పట్టించుకోకపోతే డయల్ 100 కి సమాచారం ఇచ్చాను మా పోరాటం కూటమి ప్రభుత్వంపై కాదు కూటమి నాయకులపై కాదు అరాచకాలకు అవకాశం కల్పిస్తున్నటువంటి అధికారుల పైన మేము జనతా వారధి అనే కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా కూడా చేస్తూ ఉన్నాము. ఇకపైన ప్రజలకు ఏ సమస్య వచ్చినా కూడా మా దృష్టికి తీసుకొని వస్తే దాని పరిష్కారం కై మీ తోడుగా నీడుగా ఉండి మీ తరపున అవసరమైతే పోరాడి మీ తరపున ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి ప్రజలందరికి అన్ని రకాలుగా మేము అండగా ఉంటామని తెలిపారు.

మహదేవపల్లి రవీంద్ర దంపతులను సన్మానించిన మంత్రి సవిత

పెనుకొండ మే 15 ప్రభాతవార్త

రవీంద్ర దంపతులను సన్మానిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ నగర పంచాయతీ పరిధి లోని మహాదేవపల్లి టిడిపి నాయకులు కురుబ రవీంద్ర ఇంటిలో శుక్రవారం జరిగిన శుభకార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొని రవీంద్ర దంపతులను సన్మానించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న మంత్రికి మొదట ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో మంత్రి సవిత కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, సోమందేపల్లి మండల కన్వీనర్ వెంకటేశులు, మాజీ మండల కన్వీనర్ సిద్ధ లింగప్ప, టిడిపి నాయకులు బండ్లపల్లి శివ, మహాదేవపల్లి ముత్యాలు, కురుబవాండ్లపల్లి చిన్న పోతున్న, మోటర్ పల్లి నాగేంద్ర, శంకర, బిజెపి నాయకులు రామకృష్ణ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిషోరి వికాసం పై ఆర్డిటీ ఆధ్వర్యంలో అవగాహన

కంబదూరు , మే 15, ప్రభాత వార్త

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీటీ ఏ టీ ఎల్ సురేష్

కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కిషోరి వికాసంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికల శారీరక, మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, పరిశుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై వివరించారు. యువతులు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సమాజంలో ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. బాల్య వివాహాలు, పాఠశాల మధ్యలో చదువు మానేయడం వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎ టిఎల్ సురేష్, సిఓ బాగ్యనందస్వామి, ఏ ఎన్ ఎం దేవమని, అంగన్వాడీ టీచర్ మంజుల గ్రామంలోని బాలికలు, మహిళలు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే విఫలం

- ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడంలో విఫలమైన ఎమ్మెల్యే

- రెండేళ్లు గడిచినా నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

- నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచారన్న మాజీ ఎమ్మెల్యే వైవిఆర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వైవిఆర్

గుంతకల్లు, మే 15 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల గడిచినా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే కనీసం స్వచ్ఛమైన తాగునీరు కూడా అందించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో మృతదేహాలు లభించడంతో నీళ్లు తాగాలంటే ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిదులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు, గంజాయి, గ్యాంబ్లింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలు రాజ్యమేలుతున్నాయన్నారు. అభివృద్ధి చేస్తారని నమ్మి ఓట్లు వేసిన ప్రజలను నట్టేట ముంచారన్నారు. రానున్న రోజుల్లో వారికి ప్రజలే గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజనేయులు, మాజీ కౌన్సిలర్ లింగన్న, నాయకులు బాబురావు, నూర్ నిజామి, అబ్దుల్ బాషీద్, రంగనాయకులు, పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

గుత్తి, మే 15 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న 5,9,11 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆన్‌లైన్ మోడ్‌లో స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తెలిపారు. కళాశాల పనివేళల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 వరకు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు. నిర్దేశించిన మేరకు ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన తెలిపారు.

ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీలో బ్లీచింగ్ పౌడర్ నిల్..!

-ఏడాదికి రూ.కోటి పైచీలకు ఆదాయం ఉన్న పంచాయతీలో దుస్థితి -6 నెలల కాలంగా పట్టణంలో బ్లీచింగ్ పౌడర్ వాసనే కరువాయె -మరుగు ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లక రోగాల బారిన ప్రజలు -40వేల పైచీలకు జనాభా ఉన్న పట్టణంలో పంచాయతీ నిర్లక్ష్యం



ఉరవకొండ, మే 15 ప్రభాతవార్త

ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతోంది. 40వేల పైచీల జనాభా ఉన్న పట్టణంలో గడిచిన 6 నెలల కాలంగా ఒక్క బస్తా బ్లీచింగ్ పౌడర్ కూడా కొనగోలు చేయకుండా తూతూ మంత్రంగా పారిశుద్ధ్య పనులు చేయిస్తూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీలో బ్లీచింగ్ పౌడర్ నిల్వలు ఉన్నాయోలేదో కూడా తెలియని పరిస్థితుల్లో అధికారులు పాలన సాగిస్తుండటంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఏడాదికికోటి రూపాయలకు పైగా ఆదాయంఉన్న మేజర్ పంచాయతీలో ఈ దుస్థితి ఏంటని ఆదాయం, నిధులు ఎక్కడికి పోతున్నాయన్న ప్రశ్న తలెత్తుతోంది. వివరాల్లోకి వెళితే... గ్రామ పంచాయతీల విధుల్లో పారిశుద్ధ్యంనిర్వహణ ప్రధానమైనది. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు రోగాలబారిన పడకుండా పారిశుద్ధ్య చర్యల్లోభాగంగా ప్రతినిత్యం మరుగు నీటి కాలువలు, చెత్తాచెదారం శుభ్రం చేయించడం, మురుగు నీటి నిలువ ప్రదేశాల్లో దోమలు, ఈగలు, బ్యాక్టీరియాల వ్యాప్తి జరుగకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించడం ముఖ్యమైంది. అయితే ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీకు గడిచిన 6 నెలల కాలంగా ఒక్కటంటే ఒక్క బస్తా బ్లీచింగ్ పౌడర్ కూడా కొనగోలు చేయకుండా పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారంటే ప్రజల ఆరోగ్యంపై వారికి ఎంతమేర చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోచ్చు. మరి మరుగునీటి కాలువలు, మురుగు నిల్వ ప్రదేశాల్లో ఏం చల్లుతున్నారంటే ఎందుకూ పనికిరాని నాశిరకమైన పౌడి సున్నంను అప్పుడప్పుడు చల్లించి చేతులు దులుపుకొంటున్నట్లు స్పష్టమౌతోంది. క్రిమి కీటకాలను నాశనం చేసి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చేయడంలో బ్లీచింగ్ పౌడర్ ప్రధాన భూమిక పోషిస్తుందని తెలిసినా అధికారులు ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేయడంతో జ్వర పీడితులతో ప్రభుత్వాసుపత్రి నిత్యం కిటకిటలాడుతూ కనిపిస్తోంది. ఇటీవలే రుర్బన్ పంచాయతీగా అప్‌గ్రేడ్ అయిన ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా అధికారులు కూడా దృష్టి సారించకుండా చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారన్న విమర్శలు లేకపోలేదు.

బ్లీచింగ్ పౌడర్ లేదా..? నాకు తెలియదే..!

ఈ విషయమై 'ప్రభాతవార్త' మేజర్ గ్రామ పంచాయతీ పరిపాలన అధికారి షేక్ మహమ్మదర్ రఫీను వివరణ కోరగా పంచాయతీలో బ్లీచింగ్ పౌడర్ లేదన్న విషయం తనకు తెలియదని ఆశ్చర్యం వ్యక్తం చేయడం విశేషం. బ్లీచింగ్ పౌడర్ లేదన్న విషయాన్ని మేస్త్రీలు తనకు చెప్పలేదని ఇప్పుడు తెలిసింది కాబట్టి ఇండెంట్ పెట్టి తెప్పిస్తామన్నారు.

03ATP15_03ATP15.qxd 15-05-2026 PM 11:34 Page 1

రైతులకు తక్కువ ధరలో నాణ్యమైన పశు ఆహారం : జిల్లా కలెక్టర్ ఆనంద్

కనేకల్లు మే 15 ప్రభాతవార్త

రైతులకు తక్కువ ధరలో నాణ్యతమైన పశు ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ రైతులకు సూచించారు. కనేకల్ మండల పరిధిలోని సొల్లాపురం గ్రామంలో నిర్వహించిన పశుసంవర్ధక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రైతులకు ముఖ్య సూచనలు చేస్తూ అనంతపాల దాణా పథకాన్ని విస్తృతంగా వివరించారు.ఈ సందర్భంగా, వల్లభా కంపెనీ ద్వారా తయారు అయ్యే పశు దాణాను మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ విధానం వల్ల రైతులకు నాణ్యమైన దాణా తక్కువ ధరలో అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ సరఫరాను పీఏసీఎస్ గోదాముల ద్వారా అమలు చేస్తూ, రెండు వారాల లో రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో 1350 ఉన్న 50 కేజీల దాణా బస్తాను ప్రభుత్వం 1125కి అందిస్తూ, ఒక్క బస్తాపై 225 (సుమారు 16.7 శాతం) ఆదా కల్పిస్తోంది అన్నారు. ఇక వ్యవసాయ పరంగా కూడా రైతులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని అనుసరించడం ద్వారా వర్షాలు మొదలైన వెంటనే విత్తనాలు మొలకెత్తి మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

అలాగే పశువుల మంచి పశుపోషకాన్ని పెంచుకోవడానికి మంచి కాలం అని కూడా తెలియజేశారు. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో ఇది ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. అదేవిధంగా, నీటి వనరులను సమర్థంగా వినియోగించుకు నేందుకు ట్యాంక్ బెడ్ కల్టివేషన్ పై దృష్టి పెట్టాలని సూచించారు. చెరువుల అడుగుభాగంలో పశుగ్రాసాన్ని వేసుకోవడం ద్వారా

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న ఫీడ్ వాడటం వల్ల పాలు ఉత్పత్తి పెరగడంతో పాటు, పశువుల గర్భధారణ శాతం కూడా మెరుగుపడింది అని రైతులు హర్షం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖ పరిపాలన అధికారి డా.ప్రేమ్ చంద్, ఉమామహేశ్వర్ రెడ్డి డిప్యూటీ డైరెక్టర్ ఊరవకొండ , లక్ష్మీ శైలజ కనేకల్ అసిస్టెంట్ డైరెక్టర్, డాక్టర్ వెంకట రెడ్డి, డాక్టర్ మృదుల, మండల పశు సంవర్ధక సహాయకులు, ఎంపీడీవో విజయ సింహారెడ్డి బ్రహ్మయ్య రైతులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు భారీగా తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

అమడగూరు, మే 15 ప్రభాతవార్త

సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో శుక్రవారం జరిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనకు అమడగూరు మండలం నుండి భారీ ఎత్తున టిడిపి శ్రేణులు తరలివెళ్లారు. పుట్టపర్తిలో నిర్వహించిన ఏరో స్పేస్ ప్రాజెక్ట్ భూమిపూజ కార్ య్రకమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, మంత్రి నారా లోకేష్‌లు హాజరయ్యారు. భూమిపూజ కార్యక్రమంతో పాటు బహిరంగసభ నిర్వహించారు. ఈ కార్ య్రకమానికి అమడగూరు మండలం నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో టిడిపి శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంబాబునాయుడు, కృష్ణమూర్తి, రామచంద్రారెడ్డి, కాంచనగారపల్లి రాజారెడ్డి, ఎంపిడిఒ రామనాథరెడ్డి, ఏపిఒ మధుసూదన్‌రెడ్డి, వెలుగు ఏపిఎం భారతి, సర్వేర్ సురేంద్ర ఆయా పంచాయతీల్లో ప్రజలకు ప్రత్యేక వాహనాలతో పాటు భోజన సౌకర్య ం కల్పించారు. తరలివెళ్లిన వారిలో స్టోర్ డీలర్లు, ఎన్‌ఆర్‌జిఎస్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకెపి ఆనిమేటర్లు కవిత, వడ్డెర సంఘం అధ్యక్షుడు వల్లిపి కిష్టప్ప, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్, పాతపాలెం వెంకటరమణ, దేవర రామప్ప, రవి స్టూడియో మూర్తి, భజంత్రీ మూర్తి, మారుతి, గుడ్ల సోము, డైమండ్ అంజి, గుడ్ల అంజి, పుట్ల చంద్ర, నారాయణ, తదితర కూటమి నాయకులు,

ముఖ్యమంత్రి పర్యటనకు తరలివెళుతున్న దృశ్యం

కార్యకర్తలు, అభిమానులు వున్నారు.

అనారోగ్యంతో బిజెపి నాయకుడు మృతి

తనకల్లు, మే 15 ప్రభాతవార్త

తనకల్లు మండలం ఉస్తినిపల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు వెంకటరాయప్ప అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిజెపి పార్టీ నాయకులు, భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ మెంబర్ విష్ణువర్ధన్‌రెడ్డి, బిజెపి పార్టీ ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు హసనాపురం చంటి గ్రామానికి చేరుకుని వెంకటరామప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే కుటుంబసభ్యులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేశారు. మండల భారతీయ జనతా పార్టీ నాయకులు వెంకటరామప్ప పార్థివదేహానికి భారతీయ జనతా పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించి ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చ రాష్ట్ర కార్యదర్శి హసనాపురం చంటి, మండల అధ్యక్షులు బాబురెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జయచంద్ర, లీగల్ సెల్ జానకిరామ్, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బాబాఫక్రుద్దీన్, బాలాజీ, విశ్వనాథ్,



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న హసనాపురం చంటి

సోము, ఆంజనేయులు, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

ఆకులేడు సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిడిఓ భాస్కర్

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ భాస్కర్

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ భాస్కర్

శింగనమల, మే 15 ప్రభాతవార్త

మండలపరిధిలోని ఆకులేడు, లోలూరు గ్రామ సచివాలయాలను శుక్రవారం ఎంపిడిఓ భాస్కర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి, సచివాలయ ఉద్యోగు లందరూ సమయపాలన పాటించాలన్నారు. అనంతరం ఆకులేడు గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, అనంతరం అదే గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పంచాయితీ కార్యదర్శి నరసింహారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ రఫి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు మోడల్ కాలేజీ విద్యార్థి ఎంపిక

అమడగూరు, మే 15 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మోడల్ కాలేజీ విద్యార్థి పచ్చార్ల జయమణికంఠనాయుడు 119 ర్యాంక్ సాధించి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ శిరీషబాయి శుక్రవారం తెలిపారు. ఓడిచెరువు మండలం, తుమ్మలకుంట్లపల్లి గ్రామానికి చెందిన జయమణికంఠనాయుడు అమడగూరులోని మోడల్ కాలేజీలో 2025-26లో ఇంటర్మీడియట్ ఎంపిసి చదివాడు. ఏప్రిల్ 24 నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్షలో విద్యార్థి జయమణికంఠనాయుడు 119 ర్యాంక్ సాధించి ప్రతిభ కనబరిచాడు. విద్యార్థి జయమణికంఠనాయుడు ఏపీ రెసిడెన్షియల్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందుతున్న సందర్భంగా ప్రిన్సిపాల్ శిరీషబాయి, మోడల్ స్కూల్, కాలేజీ అధ్యాపక బృందం, సహచర విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు పచ్చార్ల ఆంజనేయులునాయుడు, పచ్చార్ల పార్వతి, సోదరి పచ్చార్ల హరిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని గాజుల పల్లి గ్రామంలో శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకు రాలు అరుణజ్యోతి ప్రతిభ కనబ రిచిన విద్యార్థి పచ్చార్ల జయమణి కంఠనా యుడుకు అభినందలు తెలిపారు.

పచ్చార్ల జయమణికంఠనాయుడు

జెడ్పీహెచ్ఎస్ గొందిరెడ్డిపల్లి విద్యార్థినికి విమాన ప్రయాణం బహుమతి

అనంతపురం న్యూటౌన్, మే 15 ప్రభాతవార్త

రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహిస్తూ ఎస్ఎ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు బి.కె. నారాయణ ప్రత్యేక ప్రకటన చేశారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు తన సొంత ఖర్చుతో విమాన ప్రయాణం చేయిస్తానని ముందుగా హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థిని ఈ. రాజిత 600 మార్కులకు గాను 563 మార్కులు సాధించి ప్రతిభ కనబరి చింది. ఇచ్చిన మాట ప్రకారం బి.కె.నారాయణ, భార్య పద్మావతి (సూపరిం టెండెంట్ అగ్రికల్చర్ ఆఫీస్) శుక్రవారం ఉదయం 7 గంటలకు బెంగళూరు నుండి విజయవాడ వరకు రాజితకు విమాన ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ వారు కూడా ఆమెతో పాటు ప్రయాణిం చారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఈ.రా జితకు, ఉపాధ్యాయులు బి.కె. నారా యణకి పాఠశాల సిబ్బంది అభినందనలు తెలియజేస్తూ హ్యాపీ జర్నీ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల ప్రతి భను గుర్తించి ప్రోత్సహిస్తున్న ఉపాధ్యా యుల సేవాభావాన్ని స్థానికులు అభినందించారు.

విమానంలో ప్రయాణిస్తున్న దృశ్యం

మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

యాడికి, మే 15 ప్రభాతవార్త

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటూ, సేవయే పరమావధిగా యాడికి చెందిన "మే ఐ హెల్ప్ యూ" ఫౌండేషన్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది. తాడిపత్రి పట్టణంలో గత కొంతకాలంగా ఒంటరిగా నివసిస్తున్న సఫారే నాగరత్న (71) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మరణించగా ఆమెకు బంధువులు లేకపోవడంతో విషయం తెలుసుకున్న యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు ముందుండి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. స్వకులసాళి ఏపీ ప్రెసిడెంట్ కమలే నగేష్ సమాచారం మేరకు ఫౌండేషన్ సభ్యులు చందగాని ధ్రువనారాయణ, సాకరే శంకరప్ప, పల్లా శ్రీరంగ, టి.లక్ష్మీకాంతమ్మలు వృద్ధురాలి భౌతికకాయానికి హిందూ సాంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. అదేవిధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యవసర స్థితిలో ఉన్న రోగులకు, గర్భవతులకు రక్తం అవసరమైనప్పుడు ఫౌండేషన్ సభ్యులు స్వయంగా ఆసుపత్రులకు వెళ్లి రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తూ, పేద విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో వారికి అవసరమైన నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామాగ్రిని ఉచితంగా అందజేస్తున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజ శ్రేయస్సు కోసమే పనిచేస్తున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులను ప్రజలు కొనియాడుతున్నారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతలో వేదవ్యాస మహర్షి విగ్రహం ఏర్పాటు చేయాలి

- మంత్రి నారా లోకేష్‌ను కోరిన జశ్వంత్ వ్యాస్

అనంతపురం కల్చరల్, మే 15 ప్రభాతవార్త

భారతీయ సంస్కృతి, వేద సాంప్రదాయాలకు ఆద్యుడైన మహర్షి వేదవ్యాస విగ్రహాన్ని జిల్లా కేంద్రం అనంతపురంలో ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ యువజన అధ్యక్షులు, టీడీపీ యువ నాయకులు జశ్వంత్ వ్యాస్ కోరారు. జిల్లా పర్యటకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ..ప్రపంచానికి మహాభారతం, భాగవతం, వేదాలు వంటి మహోన్నత గ్రంథాలను అందించిన మహనీయుడు అని, భారతీయ ఆధ్యాత్మికత, ధర్మ పరిరక్షణలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. ఈ నేపథ్యంలో అనంతపురం నగరంలో మహర్షి వేదవ్యాసుల విగ్రహాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే ప్రతి సంవత్సరం జరిగే వ్యాస జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆ రోజు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని జశ్వంత్ వ్యాస్ విజ్ఞప్తి చేశారు.

కార్యకర్త పాడేమోసిన ఎమ్మెల్యే కందికుంట

తలుపుల,మే15, ప్రభాతవార్త:

మండల పరిధిలోని నూతనకాలువ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త వల్లెపు చక్రపాణి దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాడి మోశారు.పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ పార్టీకి సేవ చేసిన చక్రపాణి మన మధ్య లేకపోవడం పార్టీకి,వారి కుటుంబానికి తీరని లోటని ఎమ్మెల్యేపేర్కొన్నారు. వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని తెలియజేసి తుది వీడ్కోలు పలుకుతూ అత్యక్రియలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్యకర్త పాడే మోస్తున్న ఎమ్మెల్యే కందికుంట

అనాథ వృద్ధురాలి అంత్యక్రియలకు ఆర్థికసాయం

తాడిపత్రిటౌన్, మే 15 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వున్న బాలికల హై స్కూల్ సమీపంలోని డాక్టర్ ఆనంద్‌స్వరూప్ కాలనీలో నివసిస్తూ మృతి చెందిన అనాథ వృద్ధురాలు నాగరత్నబాయి అంత్యక్రియలకు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 10 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని నిర్వాహకులకు అందజేశారు. మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమం కోసం సంస్థ తరుపున ఆర్థిక సాయం అందచేయడం జరిగిందని సేవా సంస్థ అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని ఆశీర్వాదంతో ఇటువంటి సేవ చేసే అవకాశం రావడం మా అదృష్టమన్నారు. అనాథలకు, ఆదరణ లేని వారికి అండగా నిలవడమే మా సంస్థ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు గుర్రప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, సభ్యురాలు మంజులవాణి, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందచేస్తున్న దృశ్యం

ఆర్డీటి ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన సదస్సు

యాడికి, మే 15 ప్రభాతవార్త

యాడికిలోని ఆర్డీటి పాఠశాలలో శుక్రవారం కిశోరి వికాసంపై బాల బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కిశోరి వికాసం సమ్మర్ క్యాంపులో భాగంగా కిశోర బాలబాలికలకు లైంగిక పునరుత్పత్తి, ఆరోగ్యం మరియు హెచ్ఐవి, ఎయిడ్స్, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి ఏటిఎల్ లలిత, అంగన్‌వాడి టీచర్ హేమావతి, సిబిటి విజయలక్ష్మి, అమరావతి, తదితరులు పాల్గొన్నారు

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శింగనమల మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా బ్యాళ్ల ధనుంజయ నియామకం

శింగనమల, మే 15 ప్రభాతవార్త

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శింగనమల మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా ..బ్యాళ్ల ధనుంజయ.. నియమితులయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత ..వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. నియోజవర్గ యువ నాయకుడు డాక్టర్ సాకే రుత్విక్ గారు ఆదేశాలతో, మండల నాయకులు, తరిమెల వంశీ గోకుల్ రెడ్డి, మండల కన్వీనర్ ఆలమూరు పరంధామ రెడ్డి, సాకారంతో మండల స్థాయి సీనియర్ నాయకులందరి ఏకాభిప్రాయంతో ధనుంజయను ఈ బాధ్యతలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బ్యాళ్ల ధనుంజయ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, సాకే శైలజానాథ్‌కు, తనకు మద్దతుగా నిలిచిన మండల సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

శివాలయంలో మాసశివరాత్రి పూజలు

పంచముఖ కవచంతో పరమేశ్వరుని అలంకరించిన దృశ్యం

రాజరాజేశ్వరిదేవిని అలంకరించిన దృశ్యం

తాడిపత్రిటౌన్, మే 15 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సవీ ుపంలోని పెన్నానది తీరాన వెల సిన బుగ్గరామ లింగేశ్వ రస్వామి ఆలయంలో శు క్రవా రం మాసశివరాత్రి పూజలను ఘనంగా నిర్వహిం చారు. ఉదయం ఆలయ అర్చకులు యోగానంద కుమార్‌శర్మ, రామకృష్ణశర్మలు స్వామివారికి పంచామ ృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో పాటు పంచ ముఖ కవచంతో ప్రత్యేకంగా అలంకరించి దశవిధ హారతులతో మహా మంగళ హారతి నిర్వహించారు. అదే విధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే శివపార్వ తుల పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్ నాయుడు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, SINGANAMALA KATTABADI SHANNU KHAIRUN (Old Surname) W/o Shaik Mahammad Sadiq R/o 1-473, Second Road, Anantapur, Ananthapuramu (D)-515001 AP, I Have changed my Surname as **SINGANAMALA KATTUBADI SHANNU KHAIRUN,** Here after my name is known as **SINGANAMALA KATTUBADI SHANNU KHAIRUN** (NEW Surname) **W/o SHAIK MAHAMMAD SADIQ.**

అత్యంత నాణ్యతా ప్రమాణాలతో లైనింగ్ పనులు పూర్తి చేయాలి

-హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల పరిశీలనలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ - జిల్లాలో 6.50 కిలోమీటర్ల పరిధిలో కాలువకు ఇరువైపుల లైనింగ్ పనులు - గండ్లు పడటం, సీపేజీ, లీకేజీలు లేకుండా చేయడమే లక్ష్యమన్న కలెక్టర్

లైనింగ్ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

పనులు జరుగుతున్న తీరును కలెక్టర్‌కు వివరిస్తున్న హంద్రీనీవా అధికారులు

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

ఉరవకొండ, మే 15 ప్రభాతవార్త

కాలువ లైనింగ్ పనులు అత్యంత నాణ్యతా ప్రమాణాలతో ఎక్కడా రాజీ పడకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు జరుగాలని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. ఉరవకొండ మండల పరిధిలోని కౌకుంట్ల, వై.రాంపురం గ్రామాల వద్ద హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువకు ఇరువైపులా జరుగుతున్న లైనింగ్ పనులను శుక్రవారం ఉదయం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిపై ఇరిగేషన్‌శాఖ అధికా రులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు గత ఏడాది చేపట్టడం జరిగిందన్నారు.

ప్యాకేజీ 88 నుండి 216.3 కిలో మీటర్ల పొడవునా కర్నూల్, అనంతపురం జిల్లాల్లో హంద్రీనీవా జలాల ప్రవాహం ఉంటుందని ఇందులో అనంతపురం జిల్లాలో 144 కిలో మీటరు నుండి 216.3 కిలో మీటరు పొడువునా కాలువ విస్తరించి ఉందన్నారు. ఈ కాలువ పొడువునా ఎక్కడా గండ్లు పడకుండా సీపేజీ, లీకేజీలకు ఆస్కారం లేకుండా చూడటానికే జిల్లాలోని 82 కిలో మీటర్ల కాలువ పరిధిలో 6.50 కిలోమీటర్లు కాలువను గుర్తించి లైనింగ్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. రైతులకు సాగు నీటి సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా ఉండాలన్న ఉద్దేశంతో చేపట్టిన లైనింగ్ పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకూడదని కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖ గుంతకల్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ నాయక్, కాంట్రాక్టర్ ప్రతినిధి రామకృష్ణ యాదవ్, డీఈఈ రమణ, ఏఈలు సుదర్శన్ మూర్తి, తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఘనంగా ఐసిసిఎటి-2026 అంతర్జాతీయ సదస్సు

అనంతపురం, మే 16 ప్రభాతవార్త బ్యూరో

పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అనంతపురంలో మొదటి ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కంప్యూటేషనల్ ఆల్గరిథమ్స్ అండ్ కమ్యునికేషన్ టెక్నిక్స్ ఇన్ ఇంజినీరింగ్ అప్లికేషన్స్ (ఐసిసిఎటి-2026) పేరుతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు మే 15, 16 తేదీలలో ఘనంగా నిర్వహిం చారు. కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కమ్యూనికేషన్ టెక్నాల జీలు, ఇంజనీరింగ్ అనువర్తనాల రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడిని ప్రోత్సహించే లక్ష్యంతో సదస్సును నిర్వహించారు. దేశ విదేశాల నుండి పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సదస్సు ప్రారంభ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీపీఎస్సీ ఛైర్మన్ ప్రొఫెసర్ సి.శశి ధర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సాంకేతిక యుగంలో పరిశోధన, సృజనాత్మక ఆలో చనలు, అంతరశాఖల సమన్వయం అత్యంత అవసరమని తెలిపారు. శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి డా.పల్లె రఘునాథ రెడ్డి, ఛైర్మన్ డా.పల్లె కిషోర్, డైరెక్టర్ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస రెడ్డి సదస్సు విజయవంతంగా నిర్వహించిన నిర్వాహక కమిటీని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.బండి రమేష్ బాబు మాట్లాడుతూ..ఈ అంతర్జాతీయ సదస్సు పరిశోధకులు, విద్యార్థులకు తమ ఆవిష్కరణలను ప్రదర్శించేం దుకు, నిపుణులతో జ్ఞా నాన్ని పంచుకునేందుకు మంచి వేదికగా నిలిచింద న్నారు. డీన్ (అకాడె మిక్స్) డా.వై.సంతోష్ కుమార్ రెడ్డి, మేనేజ్‌మెంట్ రిప్ర జెంటేటివ్ కె.శ్రీకాంత్ రెడ్డి, అడ్మినిస్ట్రే టివ్ ఆఫీస ర్ డా.కె.మనో హర్ రెడ్డి సదస్సు విజయ వంతానికి తమ సహకారం అందిం చారని నిర్వాహకులు తెలిపారు. సదస్సులో జాతీయ, అంతర్జాతీ య స్థాయి నిపుణుల కీలక ప్రసంగాలు, సాంకేతిక పత్రాల ప్రదర్శనలు, వివిధ సాంకేతిక అంశాలపై సమాంతర సెషన్లు నిర్వహించబడ్డాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ, సిగ్నల్ ప్రాసెసింగ్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇండస్ట్రీ 4.0 అంశాలపై చర్చలు జరిగాయి. సదస్సు కన్వీనర్ డా.జి.శ్రీనివాసన్, కోకన్వీనర్ డా.ఎం.మల్లికార్జున రావు పాల్గొన్న అతిథులు, కీలక వక్తలు, సెషన్ ఛైర్మన్లు, అధ్యాపకులు, విద్యార్థి వాలంటీర్లు, నిర్వాహక కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అతిథులను సన్మానిస్తున్న పివికెకె ఛైర్మన్ పల్లె కిషోర్

షూరిటీ సంతకం చేయిస్తే ఎలాంటి పత్రాలు లేకుండా చిరు వ్యాపారులకు రుణాలు

- చిరు వ్యాపారులు చెల్లిస్తున్న అధిక వడ్డీలకు చెక్ పెట్టేందుకు జె.సి ప్రభాకర్‌రెడ్డి వరాలు

మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, మే 15 ప్రభాతవార్త

తాడిపత్రిలో ఉన్న చిరు వ్యాపారులు షూరిటీ సంతకం చేయిస్తే ఎలాంటి పత్రాలు లేకుండా రుణాలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు, అధిక వడ్డీలు చెల్లిస్తున్న చిరు వ్యాపారుల కళ్ళలో ఆనందం చూసేందుకు తాను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడిపత్రిలో గంపలు, తోపుడు బండ్లు తదితర వాటిలో వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు ఎలాంటి పత్రాలు లేకుండా వారు ఒకరితో షూరిటీ ఇప్పిస్తే పదివేల నుంచి 50 వేల రూపాయల వరకు రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. తాను తాడిపత్రి పట్టణంలో తిరుగుతున్నప్పుడు చాలామంది చిరు వ్యాపారులతో మాట్లాడడం జరిగిందన్నారు.

వారు వ్యాపారాలు ఎలా చేసుకుంటున్నారు, దానికి తగిన డబ్బులు ఎలా వస్తున్నాయి, డబ్బులకు ఎంత వడ్డీ కడుతు న్నారన్న విషయాలు తెలుసుకున్నానన్నారు. కొంతమంది చిరు వ్యాపారులు వడ్డీ వ్యాపారస్తుల నుంచి ఐదు రూపాయల నుంచి ఆరు రూపాయల వరకు వడ్డీకి డబ్బులు తీసుకుని వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారన్నారు. వడ్డీ వ్యాపారుల నుంచి చిరు వ్యాపారులకు చెక్ పెట్టేందుకు తాడిపత్రి టౌన్ బ్యాంకు నుండి రుణాలు ఇప్పిం చేందుకు సన్నాహాలు చేస్తు న్నామన్నారు. చిరు వ్యాపారులు తమకు అవసరమైన మొత్తాన్ని రుణంగా తీసుకునేందుకు బ్యాంకుకు వెళితే బ్యాంకు అధికారులు ఒకరితో షూరిటీ తీసుకొని వేగంగా రుణాలు మంజూరు చేస్తానన్నారు. రుణాలు సక్రమంగా చెల్లిస్తే ఇంకా ఎక్కువ మొత్తాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. తాడిపత్రిలో ప్రతి ఒక్కరు చక్కగా వ్యాపారాలు చేసుకునేం దుకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నానన్నారు. అర్హులైన చిరు వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు

జూన్ 1 నుంచి అమలులోకి ఎపిఎస్ పిడిసిడిఎల్ పరిధిలో 1.17 లక్షల ప్రీపెయిడ్ మీటర్లు

సిఎండి శివశంకర్

అనంతపురం కలెక్టరేట్ మే 15 ప్రభాతవార్త

ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని అనంతపురం, శ్రీ సత్య సాయి, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు మెరుగైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ఆ సంస్థ కృషి చేస్తోంది. సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల విద్యుత్ వినియోగం, బిల్లింగ్లో పాదర్శకతను పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లుగా మార్చాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల బకాయిల ఉపశమనంతోపాటు విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ కొనుగోలు సామర్థంపై ఒత్తిడిని అధిగమించేందుకు ప్రీపెయిడ్ మీటర్లను తప్పనిసరిగా అమర్చాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా సంస్థ ఈ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ప్రీపెయిడ్ మీటరింగ్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవడం, విద్యుత్తు పొదుపు, బిల్లును ఆదా చేసుకునేందుకు అవకాశం వుంటుంది. అంతేకాకుండా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారుల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది. జూన్ 1వతేదీ నుంచి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను అమలులోకి తీసుకు వచ్చేందుకు సంస్థ అవసరమైన చర్యలు తీసుకుంటోంది. సంస్థ పరిధి లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు ,మున్సి పాలిటీలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులకు సంబంధించి నెల్లూరు జిల్లాలో 17,067, తిరుపతి 19,545, చిత్తూరు 14,622, అన్నమయ్య 14, 346, కడప 16,261, అనంతపురం 8,422, శ్రీ సత్యసాయి 7,002, కర్నూలు 10,603, నంద్యాల జిల్లాలో 9,945, సర్వీసులు ఈ ప్రీపెయిడ్ విధా నంలోకి మారుతున్నాయి. ఈ మొత్తం 1.17 లక్షల సర్వీసుల్లో సింగిల్ ఫేజ్ సర్వీసులు 91,306, త్రీఫేజ్ సర్వీసులు 26,507 వున్నాయి. ఈ సర్వీసులన్నింటినీ కొన్ని గ్రూపులుగా ఏర్పాటు చేసి, ఈవాలెట్ ద్వారా రీచార్జ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించడం జరుగుతోంది. ఆయా విభాగాలు బిల్లింగ్ సైకిల్ కు సంబంధించిన విద్యుత్ చార్జీలు, స్థిర చార్జీల అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాల్సి వుంటుంది. ప్రతినెలా 5వతేదీలోగా ఆయా సంస్థలు చెల్లించా ల్సిన అడ్వాన్స్ మొత్తం వివరాలను విద్యుత్ పంపిణీ సంస్థలు ఆర్థిక శాఖకు తెలియజేయాల్సి వుంటుంది. మొబైల్ రీచార్జ్ తరహాలోనే ఈవాలెట్ ద్వారా ప్రీపెయిడ్ మీటర్ల ను రీచార్జ్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

మీ అభిమానం నా బాధ్యతను మరింత పెంచాయి..!

-సెల్ఫీ వీడియో సందేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 15 ప్రభాతవార్త

మీ అభిమానం, మీరు నా మీద పెట్టుకున్న నమ్మకం నా బాధ్యతలను మరింత పెంచాయని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారా లశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపట్టిన పార్టీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, శుభాకాంక్షలు తెలియజేసిన వారికి ఆయన సెల్ఫీ వీడియో సందేశాన్ని శుక్రవారం విడుదల చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు అనేక కార్యక్రమాలు చేపట్టిన, వ్యక్తిగతంగా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అవి కేవలం జన్మదిన వేడుకలు కాదని తనపై పెట్టుకున్న నమ్మకానికి, అభిమానా నికి ప్రతిరూపాలని తాను గుర్తిస్తు న్నాన న్నారు. మీరు చూపించిన అభి మానం నాలో కొత్త ఉత్సా హాన్ని నింపి బలాన్ని చేకూర్చుతూ నా బాధ్య తను మరింత పెంచి ందన్నారు. మన ప్రాంత అభి వృద్ధి కోసం మన ప్రాంతంలో ప్రతిఒక్కరి భవి ష్యత్తును బాగుపర్చేదా నికోసం మరింత ఎక్కువగా శ్రమిస్తానని సదా మీ సేవలో ఉంటానని ఆ వీడియో సందేశంలో మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

రూ.23.44 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సత్య కుమార్

అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు అండగా మంత్రి సత్య కుమార్ యాదవ్...!

ధర్మవరం, మే 15, ప్రభాతవార్త

ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదకుటుంబాలకు అండగా నిలుస్తూ, ముఖ్యమంత్రి సహాయ నిధి (దిలీశిసీ) ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన మొత్తం 49 మంది లబ్ధిదారులకు రూ.23,44,467/ లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. వైద్య చికిత్సల కోసం అప్పులు చేసి, కుటుంబ పోషణకే ఇబ్బందులు పడుతున్న అనేక కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఊరటనిచ్చింది. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలుస్తోందనే నమ్మకాన్ని ఈ సహాయ కార్యక్రమం మరింత బలపరిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. చెక్కులు అందుకున్న పలువురు లబ్ధిదారులు తమ కుటుంబ పరిస్థితిని వివరిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. సరైన సమయంలో ప్రభుత్వం అందించిన ఈ సహాయం తమకు ప్రాణాధారంగా మారిందని మంత్రి సత్య కుమార్ యాదవ్ గారికి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.... ప్రజల ఆరోగ్యం మరియు ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదని అన్నారు. వైద్య చికిత్సల కోసం ఎవరూ ఆర్థిక ఇబ్బందులతో వెనుకబడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (దిలీశిసీ) మరియు ఎల్ఓసీల ద్వారా ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు రూ.8,92,55,501/ కోట్ల మేర ఆర్థిక సహాయం అందించబడిందని మంత్రి తెలిపారు. శుక్రవారం పంపిణీ చేసిన రూ.23,44,467/ లక్షల సహాయంతో కలిపి మొత్తం రూ.9,15,99,968/ కోట్ల మేర ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అందించామని వెల్లడించారు. ప్రజల ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గార్ల నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ ప్రజాప్రతినిధులు, బీజేపీ మండలాల అధ్యక్షులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, ఎన్డీఏ నాయకులు, పార్టీ శ్రేణులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి మూడవ ఖాజీగా సయ్యద్ దాదాబాషాఖాద్రి

ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డిని కలిసిన సయ్యద్ దాదాబాషాఖాద్రి

తాడిపత్రిఅర్బన్, మే 15 ప్రభాతవార్త

తాడిపత్రిలో ముస్లిం సమాజానికి గర్వకారణమైన ఘట్టం చోటుచేసుకుంది. తాడిపత్రి ఖాజీగా సయ్యద్ దాదాబాషాఖాద్రిని ప్రభుత్వం అధికారికంగా నియమించిన సందర్భంగా నూతన ఖాజీ, ఇమామ్‌లు మరియు మైనారిటీ సోదరులు శుక్రవారం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. మైనారిటీ సంక్షేమం, సామాజిక ఐక్యత, తాడిపత్రి అభివృద్ధి వంటి పలు అంశాలపై చర్చలు జరిగాయి. ప్రజలందరికీ సమాన గౌరవం కల్పిస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి సేవలను మైనారిటీ సోదరులు అభినందించారు. తాడిపత్రిలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, ఇమామ్‌లు, పాల్గొన్నారు. సయ్యద్ దాదాబాషాఖాద్రి తాడిపత్రి మున్సిపా లిటీలో 25 నుంచి 36వ వార్డు వరకు, మండలంలోని సజ్జల దిన్నె, కావేటి సముద్రం, వెంకటరెడ్డిపల్లి, గన్నెవారి పల్లి, భోగసముద్రం, ఊరిచింతల, వంగనూరు, వీరాపురం, తెర న్నపల్లి, హుస్సేనాపురం పంచాయతీల్లో సేవలం దిస్తారు.

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం పలికిన రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

- ఏఎంసీఏ శంకుస్థాపనకు పుట్టపర్తికు విచ్చేసిన రక్షణ మంత్రి

పుట్టపర్తి విమానాశ్రయంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 15 ప్రభాతవార్త

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. పుట్టపర్తిలో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్ట్ సెంటర్, ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడానికిగాను ఆయన పుట్టపర్తికి చేరుకోగా మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్థిక మంత్రి ఘన స్వాగతం పలికారు.

ఈ నెల 17న తాలిం ఏ హునర్ టాలెంట్ టెస్ట్

అనంతపురం న్యూటౌన్, మే 15 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు విజయవాడ వారి ఆధ్వర్యంలో వక్ఫ్ ఎడ్యుకేషన్ మిషన్ ద్వారా తాలిం ఏ హునర్ టాలెంట్ టెస్ట్ " మే నెల 17న ఆదివారం ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్ కాలేజీ) కాలేజిలో నిర్వహించబడునని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు యెమనగ పరీక్షా కేంద్రానికి మద్యాహ్నం 1:00 గంటలకు చేరుకోవలయును. పరీక్షా కేంద్రానికి వచ్చేసమయన బ్లూ/బ్లాక్ బాల్ పెన్నులు, హాల్ టికెట్, ప్రభుత్వం ద్వారా వచ్చిన ఫోటో గుర్తింపు కార్డ్ (స్కూల్ ఐడి/ఆధార్ కార్డ్) తెచ్చుకోవాలని సూచించారు. మొబైల్, స్మార్ట్ వాచ్, బ్లూటూత్, క్యాలుక్లేటర్ లాంటి వస్తువులు పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబడవు, హాల్ టికెట్‌లో తెలిపిన సూచనలు ఖటినంగా పాటించవలసినదిగా తెలియజేశారు. సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు ట్యాంకర్లతో నీటి సరఫరా

ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

శింగనమల, మే 15 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో తాగునీటి సమస్య రావడంతో శుక్రవారం టిడిపి యూత్ నాయకుడు సుధాకర్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా వాటర్ ట్యాంకులతో నీటిని సరఫరా చేశారు.

ఎముక విరిగిన గినికోడికి ఆర్థో పెడిక్ శస్త్ర చికిత్స

గినికోడికి శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ పద్మనాభం

శింగనమల, మే 15 ప్రభాతవార్త

మండల కేంద్రంలో మహబూబ్ సాహెబ్‌కు చెందిన గినికోడిని కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఎముక విరిగిన కోడిని శింగనమల పశువైద్య శాలకు తీసుకెళ్లడంతో శింగనమల ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డా.పద్మనాభం కోడిని పరీక్షించి విరిగిన ఎముకకు చిన్నపాటి రాడ్ వేసి ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్స చేశారు. ఈ చికిత్స విజయవంతంగా జరిగిందని చికిత్స అనంతరం గాయానికి తగిన యాంటి బయోటిక్స్ నొప్పి నివారణ మందులు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతు మహబూబ్‌సాబ్ ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ తన పెంపుడు పక్షిని కాపాడినందుకు వైద్య బృందానికి కృతజ్ఞత తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలో వైద్య సిబ్బంది కల్పన, రంగనాయకమ్మ, చంద్రశేఖర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఏపి పిజి ఈ సెట్‌లో గొట్లూరు శ్రీకాంత్‌రెడ్డి ప్రతిభ

గొట్లూరు శ్రీకాంత్‌రెడ్డి

శింగనమల, మే 15 ప్రభాతవార్త

ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపి పిజి ఈ సెట్ పరీక్ష ఫలితాల్లో గొట్లూరు శ్రీకాంత్‌రెడ్డి ప్రతిభ కనబర్చారు. మండల పరిధిలోని మదిరేపల్లి గ్రామానికి చెందిన రైతు గొట్లూరు రవీంద్రరెడ్డి, గొట్లూరు నాగరత్నమ్మల కుమారుడు గొట్లూరు శ్రీకాంత్‌రెడ్డి ఏపి పిజి ఈసెట్ పరీక్ష ఫలితాల్లో సివిల్ ఇంజినీరింగ్ విభాగం 7వ ర్యాంకు సాధించారు.

భూగర్భంలో మృత్యు ఘంటికలు

ఇటీవల కొండుపల్లి గనుల్లో జరిగిన పేలుళ్లతో ప్రాణాలు కోల్పోయిన కార్మికుడు

కొండుపల్లి గనుల్లో జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన కార్మికుడు

మొదటిపేజీ తరువాయి... పర్యవేక్షించే వ్యవస్థ ఎక్కడో నెల్లూరులో కునుకు తీస్తోంది. భద్రతా వారోత్సవాలు నిర్వహించినప్పుడు తప్ప గనుల భద్రతా అధికారులు కంటికి కనిపించరు. వారికి ఏడాది ముడుపులు అక్కడికే వెళుతుంటాయనే వాదన బలంగా వినిపిస్తోంది. ఏడాదికోసారి (పేలుడు పదార్థాల నిల్వ కేంద్రాల(మ్యాగ్జైన్‌ల)ను పరిశీలించి, తమ లక్ష్యం పూర్తయినట్లు నివేదికల్లో పొందుపరచుకోవడం మినహా గనుల్లో జరిగే ప్రమాదకర పరిస్థితులు వీరికి పట్టవనే విమర్శలు ఉన్నాయి.

ః ప్రమాదాల ముప్పు..కనిపించని కనువిప్పు..!

ః 2023 నవంబరులో కొండుపల్లిలోని భూగర్భ గనిలో పేలుడు సంభవించి కోనాపురానికి చెందిన కార్మికుడు కంబగిరి స్వామి ప్రాణాలు కోల్పోయాడు. మరో కార్మికుడు రాజ్‌కుమార్‌కు కాళ్లు చేతులు విరిగిపోయాయి. నిబంధనల ప్రకారం ఇలాంటి గనుల్లో నియమిత కాలం వరకు తవ్వకాలు జరపకూడదు. అయినా అధికారులు అనతికాలంలోనే అనుమతుల్విడం అధికారుల పనితీరుకు నిదర్శనమని చెప్పవచ్చు.

ః 2023లో ఓ డోలమైట్ గనిలో పనిచేయడానికి వెళ్లిన క్రిష్టిపాడుకు చెందిన కార్మికుడు రంగనాథ ఆ గనిలో జరిగిన ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకున్నాడు. అయినా బాధితునికి ఆ గని యజమానులు ఆర్థిక సాయం కూడా చేయలేదు.

ః మూడున్నరేళ్ల కిందట ఈ భూగర్భ గనుల్లో పని చేయడానికి వెళ్లిన క్రిష్టిపాడు ఎస్సీ కాలనీకి చెందిన వీరాంజినేయులు అక్కడ జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లు, చేతులు పోగొట్టుకున్నాడు. ప్రభుత్వం ఇస్తున్న పింఛను సొమ్ముతో అతను కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి ఏర్పడింది.

ః గతేడాది ఓ భూగర్భ గనిలో సంభవించిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడగా నిర్వాహకులు వారికి చికిత్స చేయించి వదిలేశారు. తమ అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగినట్లు కార్మికులతో పోలీసులు వాంగ్మూలం సేకరించడం విశేషం.

ః కొన్ని నెలల కిందట అక్రమ భూగర్భ గనిలో రాత్రి వేళలో తవ్వకాలు సాగిస్తుండగా పేలుడు సంభవించడంతో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారికి అనంతపురంలో చికిత్స చేయిస్తున్నట్లు అధికారులను మభ్యపెట్టి బెంగళూరులో చికిత్సనందించి కేసు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా కథ ముగించారు. అక్రమ తవ్వకంపై గనుల శాఖ గాని, అనుమతిలేని తవ్వకాలపై రెవెన్యూ శాఖ గాని, అర్ధరాత్రి తవ్వకాలకై జరిపిన పేలుళ్లపై పోలీసు శాఖ గాని ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, పైగా అక్రమార్కులనే కాపాడేలా అధికారుల చర్యలు ఉండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి ప్రమాదాలపై కఠినంగా వ్యవహరించాల్సిన గనుల భద్రత అధికారులు ఇటువైపు కన్నెత్తే చూడకపోవడం విశేషం.

ః బాధ్యులపై చర్యలు తప్పనిసరి చేయాలి

గనుల్లో తరచూ ప్రమాదాలు జరిగితే నిర్వహకులతో పాటు పర్యవేక్షణ మరచిన సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని పలువురు కార్మిక సంఘాల నాయకులు డిమాండు చేస్తున్నారు. గనుల్లో పేలుళ్ల నిపుణులైన ఫోర్‌మెన్ లేదా మైన్స్ మేనేజర్ పర్యవేక్షణలో చేపట్టాలి. కానీ పట్టుమని పది గనులకు కూడా మైన్స్‌మేనేజర్లు లేకపోవడం గమనార్హం. గనుల్లో అక్రమాలపై గనుల శాఖ అధికారులు స్పందించడానికి కూడా సుముఖత చూపకపోవడం విడ్డూరం.